సాక్షి సంగారెడ్డి

బుధవారం ׀ 18 ׀ అక్టోబర్ ׀ 2023

న్యూస్‌రీల్

చికిత్సపొందుతున్న అమర ల్యాబ్స్ కార్మికుడి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): చికిత్స పొందుతున్న అమర ల్యాబ్స్ పరిశ్రమ కార్మికుడు రంగారావు(34) మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఇటీవల పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో 11 మందిలో ఐదుగురికి తీవ్రగాయాలు కావడం విదితమే. కాగా మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నయీమొద్దీన్ తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు వరప్రసాద్‌రెడ్డి, ఆనంద్‌కృష్ణారెడ్డి, ప్రవీన్‌రెడ్డి యాజమాన్యంతో చర్చలు జరిపారు. రూ.26లక్షల పరిహారాన్ని అందించేందుకు ఒప్పుకుందని, మిగతా క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

నేడు నీటి సరఫరా బంద్

సదాశివపేట(సంగారెడ్డి): బుధవారం పట్టణంలో తాగునీరు సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మిషన్ భగిరథ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడిందని వివరించారు. ప్రజలందరూ నిల్వ ఉన్న నీటిని వృథా చేయకుండా వినియోగించాలన్నారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరా యథావిధిగా ఉంటుందని వెల్లడించారు.

పత్రాలు తప్పనిసరి

- ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాం
- రూ.పది లక్షలు పట్టివేత



పట్టుకున్న నగదును చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: తరలించే నగదుకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా వెంట ఉండాలని, తనిఖీల సందర్భంగా వాటిని అధికారులకు చూపించాలని ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాం అన్నారు. మండలంలో ఉన్న ముత్తంగి టోల్ గేట్ వద్ద అసిస్టెంట్ సూపరింటెండెంట్ మణెమ్మ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి కర్ణాటక.. బీదర్‌కు వాహనంలో రూ.10 లక్షలు తరలిస్తుండగా.. ప్రశాంత్ కల్లప్ప పట్టుబడ్డాడు. అతను ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో రూ. 10 లక్షల డబ్బును స్వాధీనం చేసుకొని నియోజకవర్గ ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మోహన్, జిల్లా టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి..

ఇద్దరి అదృశ్యం



మన్నె రాజు

పటాన్‌చెరు టౌన్: వేర్వేరు చోట్ల ఓ మైనర్, వ్యక్తి అదృశ్యమయ్యారు. ఈ ఘటనలు పటాన్‌చెరు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... మండలంలో ఉన్న ఇస్నాపూర్‌కు చెందిన ఓ మైనర్ సోమవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లి పోయింది. కుటుంబ సభ్యులు స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం బాలిక తండ్రి ఫిర్యాదు చేయగా పోలీసు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పటాన్‌చెరులో ఉన్న జేపీ కాలనీ వాసి.. మన్నె రాజు ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం బయటకు వెళ్లి రాలేదు. భార్య కల్పన అతడి కోసం స్థానికంగా తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఆమె ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ శారదా పీఠంలో ప్రత్యేక పూజలు



స్వామివారితో లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ దంపతులు

హుస్నాబాద్: విశాఖ శారదా పీఠాన్ని మంగళవారం రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజశ్యామల అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మా నందేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీశ్ కుమార్ మాట్లాడుతూ శారద పీఠాన్ని సందర్శించడం, అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం, పీఠాధిపతుల ఆశీర్వాదం పొందడం సంతోషంగా ఉందన్నారు.

ఇంటింటికీ తపాలా స్కీమ్‌లు

- పోస్టల్ శాఖ ఏఎస్పీ సంపత్ రెడ్డి
- 21 వరకు కొత్త ఖాతాల స్పెషల్ డ్రైవ్



సికింద్లాపూర్‌లో సంపత్‌రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన వివిధ రకాల పథకాలు వినియోగించుకున్నప్పుడే గ్రామీణ ప్రజలు ఆర్థిక పరిపుష్టిని పొందగలుగుతారని సంగారెడ్డి డివిజనల్ పోస్టల్ శాఖ ఏఎస్పీ సంపత్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలో ఉన్న సికింద్లాపూర్‌తో సహా పలుగ్రామాల్లో పర్యటించారు. పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి చిన్న మొత్తాల పొదుపు ద్వారా రేపటి రోజు ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందవచ్చు అన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 100 ఏళ్ల వయస్సు వరకు పొదుపు చేసుకునేందుకు వివిధ పథకాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వీటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవింగ్స్ ఖాతా, రికరింగ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, టైం డిపాజిట్, మంత్లీ ఇన్‌కమ్ స్కీం, సుకన్య సమృద్ధి యోజన, గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీలు ఉన్నాయని వివరించారు. ప్రజలకు మరింత దగ్గరగా చేరువ కావాలని ఉద్దేశంతో పోస్టల్ శాఖ ఈనెల 16 నుంచి 21 వరకు కొత్త ఖాతాల ప్రారంభ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతోందని చెప్పారు. ఖాతా తీసుకునే సమయంలో ఒకసారి ఆఫీస్‌కు వస్తే తర్వాత నుంచి ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచి లావాదేవీలు నిర్వహించుకోవచ్చు అని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి ఇంటింటికీ తపాలా స్కీమ్‌లు దరిచేరే వరకు సేవాభావం కలిగి అంకితభావంతో ఉద్యోగులు సేవలను విస్తృత పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెయిల్ వెర్సర్ శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

గాయత్రీదేవిగా దర్శనం

వాసవీ కన్యకా పరమేశ్వరి, దుర్గాదేవి అమ్మవార్లు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. శరన్నతవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం సంగారెడ్డి పట్టణంలో ఉన్న పరమేశ్వరి అమ్మకు, ఇస్మాయిల్ ఖాన్ పేటలోని దుర్గా మాతకు విశేష అలంకరణ గావించారు. అర్చకులు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చనలు నిర్వహించారు.

–సంగారెడ్డి టౌన్



దుర్గాదేవి అమ్మవారు

శ్వాస.. ధ్యాస సేవే

సిద్దిపేట ప్రజల రుణం తీర్చుకోలేనిది..

- కరువును శాశ్వతంగా తరిమేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- దశాబ్దాల కలను సాకారం చేశారు
- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటానని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం తిండి గింజల కోసం ప్రజలు ఇబ్బందులు పడే వారన్నారు. గోదావరి జలాల తరలింపుతో పల్లెలన్నీ సస్యశ్యామలమయ్యాయన్నారు. సిద్దిపేటలో కరువు అనే పదాన్ని శాశ్వతంగా తొలగించి, కోనసీమగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. ఇది ఎన్నికల ప్రచార సభ మాదిరి లేదని, మన కలలను సాకారం చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభలా ఉందన్నారు. సిద్దిపేట జిల్లా, గోదావరి జలాలు, రైల్వే లైన్ సాధించిన కేసీఆర్‌కు ఇచ్చే స్వాగత సభగా అభివర్ణించారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సైతం కేసీఆర్‌ను కారణజన్ముడిగా అభివర్ణించిన విషయాన్ని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. అప్పటి సీఎం ఎన్టీఆర్‌కు సిద్దిపేటను జిల్లా చేయాలని, ఎమ్మెల్యే హోదాలో వినతి పత్రాన్ని ఇచ్చిన కేసీఆర్, అదే చేతితో జిల్లా ఇచ్చి చరిత్ర సృష్టించారని కొనియాడారు. సిద్దిపేట మీదుగా సిరిసిల్లా, కొత్తపల్లి రైల్వేలైన్‌కు అడుగు వేసి, ప్రజల కలనుసాకారం చేశారన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.630 కోట్లను కేటాయించారన్నారు. సిద్దిపేట ప్రాంత ప్రజలకు కేసీఆర్ గురించి పూర్తిగా తెలుసని, ఎమ్మెల్యేగా, రాష్ట్రమంత్రిగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఏ పదవిలో ఉన్నా వ్యవసాయం చేసి, నిఖార్సయిన రైతు బిడ్డగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కొత్తప్రభాకర్‌రెడ్డి, దామోదర్‌రావు, ఎమ్మెల్సీలు దేశపతిశ్రీనివాస్, యాదవరెడ్డి, అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, కార్పొరేషన్ చైర్మన్‌లు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పులకించిన పురిటి గడ్డ



సీఎం కేసీఆర్‌కు తిలకం దిద్దుతున్న రోజాశర్మ

సిద్దిపేటజోన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఉద్యమగడ్డ, ఉద్యమ సారథి, సీఎం కేసీఆర్ పురిటిగడ్డ సిద్దిపేట పులకించింది. ప్రగతి, ప్రజా ఆశీర్వాద సభ లక్ష్యం సిద్ధించింది. అశేష జన సందడితో మంగళవారం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ సభ సక్సెస్ అయ్యింది. నిర్దేశిత సమయం కంటే గంట ఆలస్యంగా ప్రారంభమైనా సభ సుమారు గంట పాటు కొనసాగింది. సభలో సీఎం కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం సిద్దిపేటతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన రికార్డు మెజారిటీని తిరిగి రాసే చరిత్ర మళ్లీ మీకే దక్కాలని, భారీ మెజారిటీతో మంత్రి హరీశ్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సభలో ప్రముఖ గాయకులు మిట్టపల్లి సురేందర్, జానపద గాయకురాలు కనకవ్వలు ఆలపించిన పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. బీఆర్‌ఎస్ ప్రచార పర్వంలో భాగంగా ప్రత్యేకంగా రాష్ట్ర ప్రగతిని వివరించే రామక్క పాట స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది.

దారులన్నీ అటు వైపే..

జిల్లాలోని అన్ని దారులూ.. ఆశీర్వాద సభకే దారితీశాయి. వేలాది మంది తరలివచ్చారు. నిర్దేశిత సమయం కంటే ముందే నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి, సిద్దిపేట నుంచి ర్యాలీలుగా పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు సభావేదిక స్థలానికి చేరుకున్నారు. లక్ష జనసమీకరణ లక్ష్యంగా పార్టీ శ్రేణులు చేపట్టిన ప్రక్రియకు అశేషంగా తరలివచ్చిన జన సందడితో సభ వేదిక ప్రాంతం గులాబీ మయంగా మారింది. సీఎం కేసీఆర్ ప్రసంగం మధ్యలో నియోజకవర్గంలోని ఊర్లకు ఊర్లు, ఇక్కడే ఉన్నాయన్నట్లుగా తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి అనడం విశేషం.

గాయకుల సందడి..

సభలో ప్రముఖ గాయకులు ఆలపించిన పాటలు జోష్‌నింపాయి. మిట్టపల్లి సురేందర్ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

అక్రమాలను తీవ్రంగా పరిగణిస్తాం

- ఓటర్ అవేర్నెస్ ఫోరంలను ఏర్పాటు చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న శరత్

సంగారెడ్డి టౌన్ : అన్ని రకాల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వారికి కేటాయించిన ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ శరత్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎస్పీ రూపేష్, ఆయా శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా అన్ని బృందాలు తమ విధులు బాధ్యతగా పూర్తి అవగాహనతో నిర్వహించాలన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం తప్పులు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. అకౌంటింగ్ బృందం అకౌంట్ రిజిస్టర్ల నిర్వహణ, ముఖ్యంగా షాడో రిజిస్టర్ నిర్వహణ, అభ్యర్థుల వ్యయం నమోదు చేయడం తదితర అంశాలపై పూర్తిస్థాయి అవగాహనతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. వీడియో సర్వేలెన్స్ బృందాలతో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు వారి విధులకు సంబంధించిన వీడియోలు అన్నింటినీ పరిశీలించాలన్నారు. ఎక్కడైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘన జరిగినట్లయితే సంబంధిత రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ఎస్ఎస్టీ, వీఎస్టీ, ఎఫ్ఎస్టీ, సర్వేలెన్స్ బృందాలు కమ్యూనిటీ, ఫంక్షన్, మ్యారేజ్ హాళ్లను సైతం తనిఖీ చేయాలని, అక్కడ ఏమైనా ఎన్నికలకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఆ వివరాలను తక్షణమే సమర్పించాలన్నారు. ఓటర్లను గానీ ఓటు వేయకుండా అడ్డగించిన, ప్రభావితం చేసిన, భయభ్రాంతులకు గురి చేసిన, ప్రలోభాలకు గురి చేసిన అది వనరబిలిటీ (తీవ్రం)గా పరిగణిస్తామని అన్నారు. ఓటర్ అవేర్నెస్ ఫోరంలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పరిశ్రమలలో ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఆయా రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు సందర్శించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు నివేదిక నివ్వాలని చెప్పారు. అదేవిధంగా రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించాలని ఆర్వోలకు సూచించారు. స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా జరగాలన్నారు. ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ, ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద డబ్బు రవాణా, మద్యం, వివిధ రకాల వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అడిషనల్ ఎస్పీ అశోక్, డీఎస్పీ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీడియో సర్వేలెన్స్ బృందాల అధికారులు, సెక్టరియల్ అధికారులు, అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్లు, డీఆర్ఓ నగేష్, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలన కేసీఆర్‌కే సాధ్యం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

గజ్వేల్: జనరంజక పాలన కేసీఆర్‌కే సాధ్యమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌కు చెందిన బ్రాహ్మణ సంఘం నేతలు కేసీఆర్‌కు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లల్లా భావించి ముందుకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. బ్రాహ్మణుల సంక్షేమంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గజ్వేల్ నుంచి లక్ష ఓట్లకు తగ్గకుండా మెజారిటీని ఆయనకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకుల హన్మంతరావు, రాంఫణిధర్‌రావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా అంతర్రాష్ట్ర భజన పోటీలు



భజన చేస్తున్న సభ్యులు

జహీరాబాద్ టౌన్: అంతర్రాష్ట్ర భజన పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఉన్న భవానీ మందిర ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి బీహెచ్ఈఎల్, పరిగి, బీదర్ భజన మండళ్ల మధ్య పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈనెల 21న ఫైనల్ పోటీలు ఉంటాయని, విజేతకు రూ. 50 వేల నగదు అందజేస్తామని నిర్వాహకులు శివకుమార్, నామ రవికిరణ్‌గుప్తా తెలిపారు. ఈ ఏడాది 18 భజన మండళ్లు పాల్గొన్నాయి. కాగా, ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుంచి భజన మండళ్లు పాల్గొంటున్నాయి.

యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కేంద్రంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని జిల్లాకు చెందిన విద్యావంతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీ సాధనోద్యమ కమిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బాబురావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గ మల్లారెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ద్రోహుల అడ్రస్ గల్లంతే

బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి, పక్కన చింతా ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్

సంగారెడ్డి : సంగారెడ్డిలో జరిగేది ఆత్మగౌరవ ఎన్నికని, ఈసారి ఇక్కడ తెలంగాణ ద్రోహుల అడ్రస్ గల్లంతు చేయాలని బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌ను ఇప్పటికే రెండు సార్లు గెలిపించారన్నారు. మూడోసారి కూడా గెలవబోతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు కోసం తెచ్చిన మేనిఫెస్టో బాగుందని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదిస్తే అందరికీ అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని వెల్లడించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ చింతా ప్రభాకర్‌కు గెలిపిస్తే ప్రజలకు దగ్గరలో ఉంటారన్నారు. గత ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చిన పార్టీ బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హామీలు ఇవ్వడం తప్పా అమలు చేసిందేమీలేదని విమర్శించారు. దేశంలో 2 వేల రూపాయల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. ఆ పార్టీ పాలిత కర్ణాటకలో కేవలం రూ.750 మాత్రమే పింఛన్లు ఇస్తున్నారని విమర్శించారు. అక్కడ ఏమి చేయకుండా తెలంగాణలో ఆరు గ్యారంటీలంటూ పార్టీ నేతలు హామీలు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. ప్రజల్ని మోసం చేసేందుకు వారు వస్తున్నారని అందరూ గమనించాలన్నారు.నియోజకవర్గాన్ని గెలిచి సీఎంకు గిఫ్ట్‌గా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనకు పదేళ్ల బీఆర్‌ఎస్ పరిపాలనకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని చెప్పారు. దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.



క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి.. మహిళ మృతి


రహీమా (ఫైల్)

రామచంద్రాపురం (పటాన్‌చెరు): స్థానిక అశోక్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మణికొండ ప్రాంతానికి చెందిన రహీమా(41) సంగారెడ్డి జిల్లా కందిలో నివాసం ఉండే తమ బంధువుల ఇంటికి తన కొడుకు మూబిన్‌తో కలిసి మోటార్ బైక్‌పై మంగళవారం బయలుదేరారు. వారితో పాటు మూడేళ్ల మనవరాలు కూడా ఉంది. లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తుండగా అశోక్‌నగర్ సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తూ వారి బైక్ అదుపుతప్పి బస్సును ఢీకొంది. దీంతో రహీమా బస్సు టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న మూబిన్, మూడేళ్ల చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్‌కు 5 ఏళ్ల జైలు

సదాశివపేట(సంగారెడ్డి): మైకంలో ఆటో నడిపి మహిళ మృతికి కారణమైన ఒక ఆటో డ్రైవర్‌కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. మంగళవారం సీఐ నవీన్‌కుమార్ వివరాలు తెలిపారు. హైదరాబాద్ ఎర్రగడ్డకు చెందిన నిందితుడు మహమ్మద్ మన్సూర్ ఆటో డ్రైవర్‌గా ఉండేవాడు. 2016లో గంజాయి తాగిన మత్తులో తన ఆటో ప్రమాదానికి కారణమయ్యాడు. ఆ ప్రమాదంలో తన ఆటోలో ఉన్న సునీత మరణించింది. దానిపై అప్పటి సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితుడు మహమ్మద్ మన్సూర్‌కు ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జి.సుదర్శన్ 5 ఏళ్లు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చేప్పారని సీఐ తెలిపారు.

కారు బోల్తాపడి భార్యాభర్తలు దుర్మరణం

అల్లాదుర్గం(మెదక్): బతుకమ్మ పండగకని సొంత గ్రామానికి వెళ్తూ కారు బోల్తాపడి భార్యాభర్తలు మృతి చెందిన విషాద ఘటన గడిపెద్దాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ దేవిదాస్ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బోల్కంపల్లి గ్రామానికి చెందిన దేవమణి(58), భర్త నారాయణ(62) వారి పిల్లలు సిద్దార్థ, నవ్యవాణి, దీపిక హైదరాబాద్ నుంచి తమ సొంత గ్రామానికి బతుకమ్మ పండగ కోసం వెళ్తుండగా గడిపెద్దాపూర్ శివారులో కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో దేవమణి (58) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త నారాయణ జోగిపేట ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన సిద్దార్థ, నవ్యవాణి, దీపికను జోగిపేట ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ చెప్పారు.

వ్యాసరచన, ఆటల పోటీలు


వాలీబాల్ పోటీలతో తలపడుతున్న కేడెట్లు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ, ఎన్‌ఐసీ కేడెట్లు పాల్గొంటున్నట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం పేర్కొన్నారు. మంగళవారం శిక్షణలో భాగంగా 17 డైరెక్టరేట్ల నుంచి వచ్చిన సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్ కేడెట్లకు 'దేశ నిర్మాణంలో సంక్షిప్త ప్రసంగం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. యోగాలో 500 మంది పాల్గొన్నట్లు డిప్యూటీ కమాండెంట్ కల్నల్ పీఎస్ నందా తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్, ప్రాపర్టీ, పర్సనల్, అగ్రికల్చర్, టేకోవర్ కొరకు DSA & ఏజెంట్స్ కావలెను. Salary + Commission. ఫోన్ : 9990752820 [HA-31102]

WANTED

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [H-189343]

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబికేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గులాబీ జోష్..

సిద్దిపేటలో మంగళవారం జరిగిన ప్రజాఆశీర్వాద సభ విజయవంతమైంది. పట్టణమంతా గులాబీమయంగా మారింది. సభకు భారీ సంఖ్యలో జనం తరలి వచ్చారు. సభాప్రాంగణం జనంతో కిటకిటలాడింది. జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. పురిటిగడ్డను చూసి ముఖ్యమంత్రి కేసీఆర్ పులకించిపోయారు. ఆద్యంతం తన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. ఢిల్లీకి రాజు అయినా తల్లికి కొడుకే అన్నట్లు.. ముఖ్యమంత్రి స్థాయికి పంపిన ఈ గడ్డను మరిచిపోనని భావోద్వేగానికి గురయ్యారు.

- సిద్దిపేట కమాన్



సిద్దిపేట సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్, వేదికపై మంత్రి హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి, మధుసూదనాచారి, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు


ప్రజా ఆశీర్వాద సభకు తరలివస్తున్న ప్రజలు

- ప్రధాన రోడ్లన్నీ గులాబీమయంగా మారాయి.
- జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై హరీశ్‌రావు అంటూ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.
- రాఘవాపూర్ గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం నాయకులు జలపందిరితో సభా స్థలికి చేరుకున్నారు.
- మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రజలను లోనికి అనుమతించారు.
- సాయంత్రం 5.45కు సీఎం హెలికాప్టర్‌లో ప్రజా ఆశీర్వాద సభకు చేరుకున్నారు.
- హెలికాప్టర్ దిగిన కేసీఆర్‌కు మంత్రి హరీశ్‌రావు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకగా, జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ పర్సన్ విజిత తిలకం దిద్ది, మంగళహారతులతో స్వాగతం పలికారు.
- సీఎం ప్రసంగం అనంతరం కేసీఆర్‌కు మంత్రి హరీశ్‌రావు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందించి, పాదాభివందనం చేశారు.
- 6.34 గంటలకు సభను ముగించుకుని సీఎం సభా ప్రాంగణం నుంచి ప్రత్యేక బస్సులో రోడ్డు మార్గంగుండా హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.


సభలో నాగలి చూపిస్తున్న రైతు

- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


సభలో డోలు కొడుతున్న యువకుడు


వలలు, డప్పు చప్పుళ్లతో సభకు వస్తున్న గంగపుత్రులు


వేదికపై రామక్కకో పాట పాడుతున్న గాయకులు


చిన్నారిని ఎత్తుకుని విధులు నిర్వహిస్తున్న రామగుండం ఎస్ఐ జోత్స్న


సీఎం కేసీఆర్ చేతికి దట్టీ కడుతున్న ముస్లిం సోదరుడు


డప్పు చప్పుళ్లతో ర్యాలీగా సభకు వస్తున్న కురుమ సంఘం సభ్యులు

సరిహద్దుల్లో నిఘా ముమ్మరం

డబ్బు, మద్యం రవాణాకు చెక్
- వాహనాల తనిఖీలు ముమ్మరం
- జాతీయ, అంతర్గత రహదారులపై చెక్‌పోస్టులు



చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జహీరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా డబ్బు, మద్యం తరలింపునకు చెక్ పెట్టేందుకు పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. జాతీయ రహదారితో పాటు అంతర్గత రహదారులపైనా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా నోడల్ అధికారులతో పాటు పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఎక్సైజ్ సిబ్బంది ప్రత్యేక టీంలుగా నిఘా వ్యవస్థలో పనిచేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికలపై ప్రభావం చూపే ప్రచారాలు, నాయకుల విగ్రహాలు, చిత్రాలపై చర్యలు తీసుకున్నారు. సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి డబ్బు తరలి రావచ్చనే ఉద్దేశంతో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై ప్రత్యేకంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై వాహనాల రాక పోకలు అధికంగా ఉండడంతో అదనపు సిబ్బందిని నియమించారు. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో ఎక్సైజ్ పోలీసులతో పాటు రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొంటున్నారు.

ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు

పక్క రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చే ప్రధాన రహదారులపై ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జహీరాబాద్ నుంచి బీదర్ రహదారిపై న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లి వద్ద సరిహద్దు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. చించోళి నుంచి జహీరాబాద్ వచ్చే రహదారిపై మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ వద్ద, కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి వద్ద, నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

రూ.24 లక్షల పట్టివేత..

ఇప్పటి వరకు పక్క రాష్ట్రాల నుంచి ఎటువంటి పత్రాలు లేకుండా రాష్ట్రంలోకి తరలిస్తున్న రూ.24 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. 13న మాడ్గి చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.3 లక్షలు, అదే రోజు జహీరాబాద్‌లో నిర్వహించిన తనిఖీల్లో రూ.8 లక్షలు, మోర్గి చెక్‌పోస్టు వద్ద సుమారు రూ.13 లక్షల నగదును పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దు

బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి


బీఆర్ఎస్‌లో చేరిన వారితో కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజల ముందుకు వచ్చి కల్లబొల్లి కబుర్లు చెప్పే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు నమ్మొద్దని ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎనగుర్తి గ్రామానికి చెందిన 60 మంది, పద్మశాలిగడ్డ గ్రామంలోని రెడ్డి సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక ఉప ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా రఘునందన్ రావు నెరవేర్చలేదని, నయాపైసా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజలు ఆశీర్వదిస్తే ప్రశ్నిస్తా..

ఎమ్మెల్యే రఘునందన్‌రావు


బండారుపల్లిలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): దుబ్బాక ప్రజలు ఆశీర్వదిస్తే సమస్యలపై అంసెంబ్లీలో ప్రజల గొంతుకనై ప్రభుత్వాన్ని నిలదీస్తానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు స్పష్టం చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట, పెద్ద మాసాన్‌పల్లి, బండారుపల్లి, మెట్టు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మెడలు వంచి తనశక్తి మేరకు అభివృద్ధి సాధించానని చెప్పారు. గుడికందుల, పెద్ద మాసాన్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్ టౌన్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఒక వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని మొగుడంపల్లిలో చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్.ఐ.నరేష్, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కె.సిద్దప్ప రెండో కుమారుడు ప్రసాద్(21) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ధనసిరి గ్రామానికి చెందిన బంధువుల అమ్మాయితో ఆరు నెలల క్రితం పెళ్లి చేశారు. కొద్ది రోజుల తర్వాత వారి మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో ప్రసాద్ మనస్తాపానికి గురై మంగళవారం గ్రామ సమీపంలోని పాడుపడిన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ ఫైర్ సిబ్బంది సహాయంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు.

అప్పుల బాధతో...

చేగుంట(తూప్రాన్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జెత్రం తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మడావత్ శంకర్(45) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శంకర్ ఇటీవల అప్పులు చేసి కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక పోవడంతో మూడు రోజులుగా మదనపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఊరి శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'యోగాతో రోగరహిత జీవనం'

గజ్వేల్‌రూరల్: రోగ రహిత జీవనం యోగాతో మాత్రమే సాధ్యమవుతుందని, పతంజలి యోగా పీఠం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పరమార్థదేవ్ పేర్కొన్నారు. జిల్లా పోషకుడు డాక్టర్ నరేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ తరగతులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దీర్ఘ, స్వల్ప కాలిక వ్యాధులకు యోగ, ప్రాణాయామమే దివ్య ఔషధమన్నారు. యోగాను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా పతంజలి యోగా పీఠం కృషి చేస్తోందన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక మాట్లాడుతూ యోగా సాధన పాఠశాల స్థాయి నుంచే ప్రారంభం కావాలన్నారు. కార్యక్రమంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి కృపాకర్, యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శివుడు తదితరులు పాల్గొన్నారు.


మంటలు ఆర్పే విధానాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విపత్తులను అడ్డుకుందాం

అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తులు భారీ ఆస్తి, ప్రాణనష్టం కలిగిస్తాయి. అవి సంభవించినపుడు ఎలా ఎదుర్కోవాలి, మంటలను ఎలా ఆర్పాలి అనే అంశాలపై గజ్వేల్ అగ్నిమాపక అధికారి కుమార్ తమ సిబ్బందితో కలిసి వర్గల్ నవోదయ విద్యార్థులకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. బ్యాగ్‌లెస్ డే సందర్భంగా మంగళవారం నవోదయ గ్రౌండ్‌లో సిలిండర్ నుంచి మంటలు చెలరేగితే వాటిని ఆర్పేయడం, ఫైర్‌గన్స్‌తో నీటిని స్ప్రే చేయడం, నీట మునిగిన వారిని రక్షించడంపై మాక్‌డ్రిల్ చేసి చూపారు.

- వర్గల్ (గజ్వేల్)


ఫైర్‌గన్‌తో వాటర్ స్ప్రే చేస్తున్న దృశ్యం